VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 09 మే 2025

వెల:రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 290

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




# బరితెగించిన పాక్







# యుద్ధం మొదలు...?

3లో

రాజస్తాన్‌లోని జైసల్మేర్‌పై పాకిస్తాన్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను ధ్వంసం చేసిన ఎస్400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్

- దాయాది దుస్సాహసం, దీటుగా బదులిచ్చిన భారత్
- లాహోర్ నుంచి కరాచీ దాకా ముప్పేట దాడులు
- తారస్థాయికి భారత్, పాక్ ఉద్రిక్తతలు
- పూర్తిస్థాయి యుద్ధం దిశగా పరిస్థితులు

## మెడికల్ కాలేజీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం



వైద్య సేవల కోసం భారీగా నిధుల వెచ్చింపు

ఖమ్మంలో మెడికల్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన

పాల్గొన్న నలుగురు మంత్రులు

2లో..

తెలంగాణలో విద్యా వైద్య రంగాలపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. ప్రపంచంతో పోటీపడేలా విద్యా వైద్య రంగాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు.






## మా జవాన్లు తలుచుకుంటే పాక్ ఉండదు

**భారత్ వైపు కన్నెత్తిచూస్తే నూకలు చెల్లినట్టే**

**'ఆపరేషన్ సిందూర్' వెనుక 140 కోట్ల మంది భారతీయులున్నారు**

**ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేపట్టిన సంఘీభావ ర్యాలీలో సీఎం రేవంత్‌రెడ్డి**


హైదరాబాద్: మా దేశ సరిహద్దుల్లోకి చొచ్చుకు వచ్చిన ఉగ్రవాదులను ప్రోత్సహించిన పాకిస్థాన్ పాలకులారా... గుర్తుపెట్టుకోండి... మా వీర జవాన్లు తలుచుకుంటే ప్రపంచపటంలో పాకిస్థాన్ దేశం ఉండదు.. దొడ్డిదారిన దేశంలో ప్రవేశించి మా తల్లులు, ఆడబిడ్డల నుదుట సిందూరాన్ని తుడిచేశారు.. భారతీయులపై దాడులు చేస్తామంటూ ఉగ్రవాదులు విర్రవీగారు... వారికి మద్దతు ఇచ్చిన మీకు, ముష్కరులకు ఆపరేషన్ సిందూర్ ద్వారా బుద్ధిచెప్పాం.. ఈ మహత్ కార్యక్రమం వెనుక 140 కోట్ల భారతీయులున్నారు. ఉగ్రవాదుల పీచమణిచే వరకూ ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుంది" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం చేపట్టిన సంఘీభావ ర్యాలీలో త్రివర్ణ పతాకం చేతబూని ఆయన పాల్గొన్నారు. ముందుగా పోలీసులు, వేలమంది ప్రజలు, మాజీ సైనికులు, ఎన్‌సీసీ కేడెట్లు తదితరులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయానికి చేరుకున్నారు. సాయంత్రం 6.45గంటలకు సీఎం రేవంత్ త్రివర్ణపతాకం పట్టుకుని బయటకు రాగా ఆయనను అనుసరించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఐపీఎస్‌లు, ఐఏఎస్‌లు, ప్రభుత్వ అధికారులు... ఇలా అంతా సచివాలయం నుంచి నెక్లెస్‌రోడ్ రోటరీ వద్దకు చేరుకున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. సచివాలయం నుంచి నెక్లెస్ రోటరీ వరకూ ర్యాలీ కొనసాగడంతో హుస్సేన్‌సాగర్ భావోద్వేగ సాగరంగా మారిపోయింది. ఇరవై నిమిషాలపాటు ర్యాలీలో నడిచిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, అధికారులు పహల్గాంలో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతిచెందిన వారి చిత్రపటాలకు నివాళు లర్పించారు. నిమిషంపాటు మౌనం పాటించారు. అక్కడున్న వారందరి హృదయాలు భారమయ్యాయి.


> "మా దేశ సరిహద్దుల్లోకి చొచ్చుకు వచ్చిన ఉగ్రవాదులను ప్రోత్సహించిన పాకిస్థాన్ పాలకులారా... గుర్తుపెట్టుకోండి... మా వీర జవాన్లు తలుచుకుంటే ప్రపంచపటంలో పాకిస్థాన్ దేశం ఉండదు.

## ఉగ్రవాదులకు జాతీయ జెండాతో అంత్యక్రియలు చేస్తారా

2లో..

- శవపేటికలపై పాక్ జెండాలు కప్పడంలో అర్థం ఏమిటో
- పాకిస్థాన్‌లో ఇలాంటి ఆచారం ఉందేమో
- ఉగ్రవాదులు లక్ష్యంగానే భారత్ దాడులు
- గతంలో దాడులకు సంబంధించిన వివరాలు ఎన్నో ఇచ్చాం
- పాక్ దేనికీ సరైన సమాధానం ఇవ్వలేక పోయింది
- విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడి






2లో..

### సౌదీ విదేశాంగ మంత్రి భారత్ రాక

విదేశాంగ మంత్రి జైశంకర్‌తో భేటీ




2లో..

### తెలంగాణ పర్యాటకానికి పెద్దపీట

అందాల పోటీల నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు

ఆయా ప్రాంతాలను సందర్శించేలా కార్యక్రమాలు



2లో..

### ఆపరేషన్ సిందూర్ ఆరంభం మాత్రమే

- ఇది కొనసాగుతుందని ప్రకటించిన కేంద్రం
- అఖిలపక్ష భేటీలో వివరాలు వెల్లడించిన రాజ్‌నాథ్
- దేశ రక్షణలో రాజీపడబోమని వెల్లడి
- సంపూర్ణ మద్దతు ప్రకటించిన విపక్ష నేతలు

వేగుచుక్క
కీడిత ప్రజల గొంతుక...

# ఆపరేషన్ సిందూర్ ఆరంభం మాత్రమే

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్‌లో వంద మందికి పైగా ఉగ్రవాదులు మరణించారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. గురువారం ఉదయం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆపరేషన్ సిందూర్ విజయం, పర్యవసానాలను ఆయన వివరించారు. సిందూర్ అనేది కొనసాగుతున్న ఆపరేషన్ అని అన్నారు. భారత్ మరిన్ని దాడులు చేయాల్సిన అవసరం లేదని, కానీ పాక్ దళాలు దాడిచేస్తే తిరిగి ఎదురు దాడి చేస్తామని చెప్పారు. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, ఎస్.జయశంకర్, జె.పి.నడ్డా, నిర్మల సీతారామన్ ప్రభుత్వం తరపున హాజరవగా, కాంగ్రెస్ నుండి లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, టిఎంసి నుండి సందీప్ బందోపాధ్యాయ, డిఎంకె నుండి టి.ఆర్.బాలు సమావేశానికి హాజరయ్యారు. పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో భారతలోని సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేపట్టేందుకు పాక్ యత్నించగా.. వీటిని భారత దళాలు దీటుగా తిప్పికొట్టాయి. ఈ క్రమంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత సహనాన్ని అలుసుగా తీసుకుంటే ఆపరేషన్ సిందూర్ తరహా చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. దేశభద్రతకు సంబంధించి ఎల్లి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని స్పష్టంచేశారు. మేం ఎల్లప్పుడూ సంయమనంతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాం. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడాన్ని విశ్వసిస్తాం. దీనర్థం ఎవరైనా మా ఓపికను దుర్వినియోగం చేయవచ్చని కాదు. మా సహనాన్ని అవకాశంగా తీసుకోవాలని ప్రయత్నిస్తే.. ఆపరేషన్ సిందూర్ మాదిరిగా తీవ్ర పర్యవసానాలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. భారత బలగాలు ఆపరేషన్ సిందూర్‌ను ఊహించని కచ్చితత్వంతో అమలు చేశాయని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. పాకిస్థాన్‌తోపాటు- పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాయని, ఇందులో అనేకమంది ఉగ్రవాదులు హతమయ్యారని చెప్పారు. ఈ ఆపరేషన్‌లో సాయుధ బలగాలు ధైర్యసాహసాలు ప్రదర్శించాయని ప్రశంసించారు. సామాన్యులకు ఎటు-వంటి నష్టం వాటిల్లకుండా ఈ ఆపరేషన్ చేపట్టామని, అత్యాధునిక పరికరాలు, సుశిక్షితులైన సాయుధ దళాల పనితీరువల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకున్ననిర్ణయాన్ని అఖిలపక్షం సమర్థించింది. సైన్యానికి బాసటగా ఉంటామని రాహుల్ తదితరులు ప్రకటించారు. ఈ క్రమంలో పాకిస్తాన్‌లో, పాకిస్తాన్ ఆక్రమిత జమ్ముకశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అప్పుడే ముగిసిపోలేదని కేంద్రం ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్ ముగిసిపోలేదని, ఇంకా కొనసాగుతోందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. అయితే భద్రతా కారణాల రీత్య ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన వివరాలను బయటపెట్టలేమని అన్నారు. అదేవిధంగా ఆపరేషన్ సిందూర్‌పై పాకిస్థాన్ అసత్య ప్రచారం చేస్తోందని, ఆ ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని కిరణ్ రిజిజు చెప్పారు. కాగా పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా బుధవారం తెల్లవారుజామున భారత్.. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై సర్జికల్ స్ట్రయిక్స్ చేసింది. ఆపరేషన్ సిందూర్ పేరుతో నిర్వహించిన ఈ సర్జికల్
÷-టస్రైక్స్‌లో మొత్తం 100 మందికిపైగా ఉగ్రవాదులు హతమయ్యారు.

# పాక్ డ్రోన్ దాడులను తిప్పికొట్టిన రక్షణశాఖ

న్యూఢిల్లీ: భారత్ ప్రతీకార దాడులతో బెంబేలెత్తుతున్న పాకిస్థాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా డ్రోన్లు, క్షిపణులతో దాడులకు యత్నించిన దాయాదికి చుక్కెదురైంది. ఈ క్రమంలోనే పాకిస్థాన్‌లోని ఆయా ప్రాంతాల్లో మోహరించిన గగనతల రక్షణ వ్యవస్థలను భారత సైన్యం లక్ష్యంగా చేసుకుంది. దీంతో లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసమైనట్లు- భారత రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. చైనాకు చెందిన హెచ్‌క్యూ-9 రక్షణ వ్యవస్థలను ఉపయోగిస్తున్న పాకిస్థాన్.. భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాల్లో డ్రోన్లు, క్షిపణి దాడులకు యత్నించింది. అవంతిపుర, శ్రీనగర్, జమ్మూ, పఠాన్‌కోట్, అమృత్‌సర్, కపుర్తలా, జలంధర్, అదామ్‌పుర్, భఠిండా, చండీగఢ్, నాల్, ఫలోడి, భుజ్ తదితర ప్రాంతాల్లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకునేందుకు యత్నించింది. అయితే.. వీటిని ఇంటిగ్రేటెడ్ కౌంటర్ యూఏఎస్ గ్రిడ్, గగనతల రక్షణ వ్యవస్థలతో సమర్థంగా అడ్డుకున్నట్లు రక్షణశాఖ వెల్లడించింది. పాకిస్థాన్ దాడులకు రుజువుగా వీటి శకలాలను ఆయా ప్రాంతాల నుంచి సేకరిస్తున్నట్లు తెలిపింది. ఈ క్రమంలోనే భారత్ ప్రతీకార దాడులకు దిగింది. పాకిస్థాన్‌లో వివిధ ప్రాంతాల్లో ఉన్న గగనతల రక్షణ రాడార్‌లు, వ్యవస్థలను లక్ష్యంగా చేసుకొని సైన్యం విరుచుకుపడింది. లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసం అయినట్లు- విశ్వసనీయంగా తెలిసింది. మరోవైపు నియంత్రణ రేఖ వెంట కాల్పుల విరమణ ఉల్లంఘిస్తూ పాకిస్థాన్ దాడులను ముమ్మరం చేసింది. జమ్మూ కశ్మీర్‌లోని రాజౌరీ, మెంధార్, పూంచ్, ఉరి, బారాముల్లా, కుప్వారా ప్రాంతాల్లో మెర్టార్లు, భారీ ఫిరంగులతో దాడులుచేస్తోంది. వీటిలో ఇప్పటివరకు 16 మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఇదిలావుంటే కరాచీ, లాహోర్, సహా ఇతర ప్రధాన నగరాలపై దాడి చేయడానికి భారతదేశం డ్రోన్‌లను ఉపయోగించిందని పాకిస్తాన్ పేర్కొంది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై భారత సాయుధ దళాలు క్షిపణి దాడులు చేసిన ఒక రోజు తర్వాత, లాహోర్, కరాచీలపై భారతదేశం డ్రోన్ దాడులు ప్రారంభించిందని పాకిస్తాన్ సైన్యం పేర్కొంది. ఇలా ఉండగా, భారత్ ఆపరేషన్ సిందూర్ కొనసాగిస్తోంది. పాక్ కు చుక్కలు చూపిస్తోంది. పాక్ దాడులను తిప్పికొడుతూ భారత్ భారీగా ఎదురుదాడులు చేస్తోంది. తాజాగా పాక్ ఆర్మీ హెడ్ క్వార్టర్‌పై భారత్ డ్రోన్ దాడి చేసింది. పాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ధ్వంసం చేసింది. అటు-, రావల్పిండి హెడ్ క్వార్టర్ పైనా భారత్ డ్రోన్ దాడి చేసింది. దీంతో పాకిస్థాన్ మీడియా ముందుకొచ్చి ప్రపంచ దేశాలతో లబోదిబోమంటూ మొరపెట్టుకుంటోంది. లాహోర్, కరాచీ ఇంకా పాకిస్థాన్ లోని ఇతర ప్రదేశాలలో భారత్ వరుస డ్రోన్ దాడులు నిర్వహించిందని పాకిస్తాన్ సైన్యం పేర్కొంది. మరోవైపు, కరాచీ విమానాశ్రయాన్ని సాయంత్రం 6 గంటల వరకు మూసివేసినట్లు- పాకిస్థాన్ ప్రకటించింది.

# మెడికల్ కాలేజీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం

ఖమ్మం: ప్రభుత్వ మెడికల్ కళాశాల ద్వారా పేదలకు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఉచితంగా అందుతాయని,ఖమ్మం మెడికల్ కళాశాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయటం చాలా సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ఈ ప్రభుత్వం దొరల కోసమో పాలకుల కోసమో పని చేసే ప్రభుత్వం కాదని అన్నారు. 9065 సీట్లలో వైద్య విద్యను అందజేస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం విద్య వైద్యానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించామని అన్నారు. పది సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 5,950 కోట్లు- ఖర్చు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఒక్క ఏడాదిలో రూ. 11,482 కోట్లు- ఖర్చు చేసిందన్నారు. వరంగల్‌లో సభ పెట్టి అడ్డగోలు మాటలు మాట్లాడిన వారికి ఈ లెక్కలు తెలియాలని చెబుతున్నానని అన్నారు. 90 లక్షల కుటుంబాలకు రూ. 10 లక్షల వరకూ లబ్ధి చేకూర్చి వైద్యం అందించామని తెలిపారు. గత ప్రభుత్వం గాలికి వదిలేస్తే రాజీవ్ ఆరోగ్య శ్రీ పెండింగ్ బిల్లులు అన్నీ క్లియర్ చేస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిన వైద్య రంగాన్ని గాడిన పెడుతున్నామని భట్టి విక్రమార్క తెలిపారు.నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణానికి గురువారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యా వైద్య రంగాలపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. ప్రపంచంతో పోటీపడేలా విద్యా వైద్య రంగాలపై ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ భవన సముదాయ నిర్మాణానికి శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డికి ప్రజల పక్షాన మంత్రి తుమ్మల ధన్యవాదాలు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నాగపూర్, అమరావతి నేషనల్ హైవే పక్కన మెడికల్ కాలేజ్ నిర్మాణం జరుగుతుందన్నారు. ఖమ్మంలో రూ. 130 కోట్లతో అద్భుతమైన మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోందని అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై విద్య, వైద్య ఆరోగ్యశాఖ శాఖలకు కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. గత ప్రభుత్వం మొండి గోడలతో వదిలి వెయ్యి కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టిన అన్నిటినీ క్లియర్ చేస్తున్నామన్నారు. విద్య వైద్య రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్మాణాన్ని పూర్తి చేస్తుందన్నారు. అన్ని రకాల మౌలిక వసతులతో మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయబోతు న్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మా అందరికీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదర్శమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రూ. 130 కోట్లతో ఖమ్మంలో మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతోందని, గోదావరి పరివాహక ప్రాంతంలో ఆరోగ్యశాఖ ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఏర్పాటు- చేస్తున్నామన్నారు. 16 నెలల పాలనలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లా ప్రజలకు సూపర్ స్పెషాలిటీ- వైద్య సేవలు అందించేందుకు కృషి జరుగుతోందన్నారు. తర్వలోనే ఖమ్మంకు ఆర్గాన్ రిట్రీ-వర్ సెంటర్ ఏర్పాటు- చేస్తున్నామని, వరంగల్‌లో రూ. 39 కోట్లతో రీజినల్ క్యాన్సర్ సెంటర్ ఏర్పాటు-
చేస్తామని తెలిపారు. అలాగే ఖమ్మంలో వ్యాస్కులర్ యాక్సెస్ సెంటర్‌ను ఏర్పాటు- చేస్తున్నామన్నారు. అన్ని గ్రామాలకు అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కోరిక మేరకు నర్సింగ్ కళాశాల ఏర్పాటు- చేస్తున్నామని దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. మిడ్ వైఫరీ కోర్సులు విద్యార్థులకు అందుబాటు-లో ఉంచబోతున్నామని, పేద వారికి వైద్యం అందుబాటు-లో ఉండాలని మంత్రి దామోదర అభిప్రాయం వ్యక్తం చేశారు.

# ఎసౌదీ విదేశాంగ మంత్రి భారత్ రాక

న్యూఢిల్లీ: భారత్-పాక్ ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకొన్న వేళ.. సౌదీ అరేబియాకు చెందిన ఓ జూనియర్ మంత్రి హఠాత్తుగా న్యూఢిల్లీలో దిగారు. దేశ విదేశీ వ్యవహారాల శాఖ జూనియర్ మంత్రి అదెల్ అల్‌జుబైర్ నేడు దిల్లీకి వచ్చి రావడంతోనే మన విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తో చర్చలు జరిపారు. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలను చల్లార్చే చర్యల్లో భాగంగా ఈ పర్యటన చేపట్టినట్లు- తెలుస్తోంది. దీనిపై విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఎక్స్‌వేదికగా పోస్టు చేశారు. సౌదీ అరేబియా మంత్రి అదెన్ అల్ జుబైర్‌తో సమావేశం జరిగింది. ఉగ్రవాదాన్ని అణచివేసే విషయంలో భారత్ దృక్కోణాన్ని ఆయనకు వివరించానని జైశంకర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్-పాక్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా సౌదీ మంత్రితో భేటీ జరిగింది. ఆ తర్వాత ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చితో మన విదేశాంగ మంత్రి భేటీ అయ్యారు. ఇప్పటికే భారత్-పాక్‌ల మధ్య రాజీ కుదిర్చేందుకు తాము సిద్ధమని ఇరాన్ వెల్లడించింది. ఇటీవల ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ.. సోదరుల్లాంటి పొరుగుదేశాలే మాకు అత్యున్నత ప్రాధాన్యం అని పేర్కొన్నారు.

# శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ శంకుస్థాపన




తిరుపతి: ఆవిష్కరణ, పెట్టుబడి కలిసేచోట భవిష్యత్తు రూపుదిద్దుకుంటుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ యూనిట్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సృష్టించే ప్రతి ఉద్యోగం, ఆవిష్కరణ ద్వారా ఏపీని ఎలక్ట్రానిక్ పవర్‌హౌస్‌గా మార్చేందుకు బాటలు వేస్తున్నామన్నారు. ఈరోజు ఎల్జీ యూనిట్‌కు మాత్రమే కాదు.. ఏపీ భవిష్యత్తు కోసం కొత్త పునాదులు వేస్తున్నాం. ఈ కార్యక్రమం ఒక నిర్మాణ ప్రాజెక్టు కంటే పెద్దది. ఇది రాష్ట్రంతో పాటు- దేశ పారిశ్రామిక వృద్ధి, సాంకేతిక పురోగతిలో ఒక మైలురాయి. రూ.5వేల కోట్లకు పైగా పెట్టుబడితో రాష్ట్రానికి ప్రపంచస్థాయి తయారీ యూనిట్‌ను ఎల్జీ తీసుకొచ్చింది. 'మేడ్ ఇన్ ఆంధ్రా నుంచి మేడ్ ఫర్ ది వరల్డ్' వరకు మా జైత్రయాత్ర కొనసాగుతుందని లోకేశ్ అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ప్రధాన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో ఒకటిగా శ్రీసిటీ- యూనిట్‌లో ఎల్జీ ఆవిష్కృతమైంది. పారిశ్రామిక రంగంలో వేగం, బలమైన మౌలిక సదుపాయాలు, ఏపీ భవిష్యత్తుపై సీఎం చంద్రబాబు నిబద్ధతకు ఇది అద్దం పడుతోంది. సులభతరమైన వ్యాపారానికి హామీ ఇవ్వడంతో పాటు- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను అనుసరిస్తున్నామని లోకేశ్ అన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి నారా లోకేష్ ఇగురువారం పర్యటించారు. యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేష్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారు. రూ. 839 కోట్లతో ఐదు అనుబంధ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కంపెనీకి భూమి పూజ చేయడంతో 20 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని చేరుకునే దిశగా రాష్ట్రంలో మరో అడుగు పడింది. రూ. 5,001 కోట్ల పెట్టుబడిలో భాగంగా 2 వేల ఉద్యోగావకాశాలను కల్పించనున్నారు. ఎల్జీ తమ సంస్థలు ఏర్పాటు- చేయడంతో ఇక్కడ ఎల్జీ సిటీ- ఏర్పడనుందని లోకేశ్ అన్నారు. విదేశీ సంస్థల ప్రతినిధుల రాకపోకలకు రాబోయే నాలుగు సంవత్సరాల్లో తిరుపతికి అంతర్జాతీయ విమానయానం పెరిగేలా చేస్తామని చెప్పారు. పరిశ్రమలు తీసుకు రావటానికి మంత్రులు, కలెక్టర్లు మాత్రమే కాదని..ప్రతి నియోజక వర్గం మరో నియోజక వర్గంతో పోటీ- పడాలని అన్నారు. పరిశ్రమల ఏర్పాటు-కు అన్ని రకాలుగా తోడ్పాటు- అందిస్తామని తెలిపారు. ఎల్జీ సంస్థ రూ.5000 కోట్లతో ఏర్పాటు- చేస్తున్న పరిశ్రమ ఆంధ్రప్రదేశ్‌కు మరిన్ని పెట్టుబడులు పెట్టే నమ్మకాన్ని తెచ్చిందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి నారా లోకేష్ పర్యటిస్తున్న నేపథ్యంలో ముందస్తు అనుమతితో కేబినెట్‌కు రావడం లేదని సమాచారం ఇచ్చారు. శుక్రవారం సత్య సాయి జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఆ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు కేబినెట్ సమావేశానికి మరో మంత్రి పయ్యావుల కేశవ్ హాజరు కాలేదు. విదేశీ పర్యటనలో ఉన్న కారణంగా కేబినెట్ భేట-కి మరో మంత్రి సత్య

# పేదల ఇళ్లు కూల్చడం హైడ్రా లక్ష్యం కాదు

హైదరాబాద్: హైడ్రా అంటే కొందరికి కడుపు మంట అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. అందుకే హైడ్రాపై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా అనేది పేదల ఇళ్లు కూల్చడానికి కాదని.. ఆక్రమణదారులను అడ్డుకోవడానికేనని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మన పూర్వీకులు ఇచ్చిన చెరువులను కాపాడుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. చెరువులు కనుమరుగైతే మన మనుగడ ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. 450 ఏళ్ల చరిత్ర ఉన్న హైదరాబాద్‌ను కాపాడుకునేందుకు.. హైడ్రా ఉపయోగపడుతుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని బుద్ధ భవన్‌లో తొలి హైడ్రా పోలీస్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. చెరువులను ఆక్రమించిన వారు ఎంత పెద్దవారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎవరేమనుకున్నా కూల్చివేతల విషయంలో మాత్రం హైడ్రా వెనక్కి తగ్గేది లేదని తెలిపారు. వర్షం వస్తే చెన్నై, ముంబై మహానగరాల పరిస్థితి ఏంటో చూస్తున్నామని ఆయన సోదాహరణగా వివరించారు. కాలుష్యంతో ఢిల్లీ విలవిల్లాడుతోంది.. ఈ పరిస్థితికి మానవ తప్పిదాలే కారణమని ఆయన పేర్కొన్నారు. మంచి పరిపాలన అందించేందుకు గడిచిన 76 ఏళ్లలో.. రాజ్యాంగాన్ని 100 సార్లకుపైగా సవరించుకున్నామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గుర్తు చేశారు. నగరాభివృద్ధి కోసం గత సీఎంలు
ఎన్నో చట్టాలు చేశారన్నారు. 1908లో హైదరాబాద్‌లో వచ్చిన వరదలు చూసి.. అప్పటి నిజాం నవాబు కన్నీరు సైతం పెట్టు-కున్నారని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అనంతరం హైడ్రా పోలీస్ స్టేషన్‌ను సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా హైడ్రా వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే 122 హైడ్రా వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. హైడ్రా తొమ్మిదిన్నర నెలల్లో ప్రజలకు మరింత చేరువైందన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖకు సంబంధించిన అధికారాలు.. హైడ్రా పోలీస్ స్టేషన్ ద్వారా కల్పించారన్నారు. వివిధ సందర్భాల్లో ఈ అధికారాలు తమకు ఉపయోగపడతాయని తెలిపారు. సీఎం ఏ ఉద్దేశ్యంతో హైడ్రాను ప్రారంభించారో.. అదే ఉద్దేశ్యంతో ఈ సంస్థ పని చేస్తుందని వివరించారు. సామాజిక బాధ్యతతో హైడ్రా ముందుకు వెళ్తుందని చెప్పారు. అసెస్ట్ ప్రొటెక్షన్ మాత్రమే కాకుండా.. డిజాస్టర్ రెస్పాండ్స్ కూడా సరైన అధికారులతో హైడ్రా పని చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.సాంకేతిక పరిజ్ఞానం కూడా పెద్ద ఎత్తులో వాడుతూ ఎఫ్‌టీ-ఎల్ పరిధి గుర్తిస్తున్నామన్నారు. హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు- ద్వారా ల్యాండ్ గ్రేబింగ్, చీటింగ్, ఫోర్జరీ చేసే వారిపై చర్యలు తీసుకోనే అవకాశం దక్కిందన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు హైడ్రా ఇలాగే ముందుకు వెళ్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. హైడ్రా పోలీస్ స్టేషన్ ప్రారంబోత్సవ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ జి. విజయలక్ష్మితోపాటు- పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# తెలంగాణ పర్యాటకానికి పెద్దపీట

**హైదరాబాద్:** అంతర్జాతీయ అతివల అందాల పోటీలతో తెలంగాణ టూరిజానికి మహర్దశ పట్టనుంది. ఇక్కడికి వచ్చే వారంతా తెలంగాణ లోని ప్రధాన పర్యాకట కేంద్రాలను సందర్శించనుండంతో వాటి ప్రాముఖ్యత ప్రపంచానికి తెలియనుంది. ముఖ్యంగా గ్రామీణ పర్యాటకం వెలుగులోకి రానుంది. తెలంగాణ ప్రభుత్వం కూడా ఇందుకు అనుగుణంగా భారగా ఏర్పాట్లు చేసింది. ఆహుతును పర్యాటక ప్రాంతాలకు తీసుకుని వెళ్లేలా ఏర్పట్లు చేసింది. తెలంగాణ పర్యాటకం అంటే రాజధాని హైదరాబాద్ మాత్రమే. మిస్ వరల్డ్ ఈవెంట్ ల నిర్వహణను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ పర్యాటకంను ప్రపంచ వ్యాప్తంగా ప్రమోట్ చేసేందుకు ప్రాధాన్యత ఇస్తోంది. తెలంగాణ గ్రామీణ సాంస్కృతిక, చారిత్రక, పర్యాటక వైభవంను ప్రపంచానికి పరిచయం చేసేందుకు మిస్ వరల్డ్ ఈవెంట్‌ను అందివచ్చిన అద్భుత అవకాశంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకునేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసింది.

ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ గ్రామీణ పర్యాటక ప్రదేశాలకు విశేష ప్రచారం దక్కనుంది. తెలంగాణ సాంస్కృతిక వైభవం, చారిత్రక గాథలు, ఆధునిక అభివృద్ధి, పర్యాటక ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలుపడంతో పాటు- తెలంగాణ గ్రామీణ పర్యాటక ప్రదేశాలను ప్రపంచ పటంలో ప్రముఖంగా నిలిపే
అవకాశం లభిస్తుంది. నాగార్జునసాగర్ బుద్ధవనం , బౌద్ధ థీమ్ పార్క్, బౌద్ధ సంస్కృతి , ఆధ్యాత్మికతకు ప్రత్యేకించిన ఆకర్షణ. ఇది బుద్ధుని విగ్రహాలు, స్తూపాలు, ధ్యాన మండపాలతో కూడిన ప్రశాంత వాతావరణాన్ని సృష్టిస్తుంది. ఇక్కడి థీమ్ పార్క్ బుద్ధుని జీవితం, బోధలు, బౌద్ధ కళ, సంస్కృతిని సజీవంగా ప్రదర్శిస్తుంది. ఈ ప్రాజెక్టు పర్యాటక రంగాన్ని బలపరుస్తూ, సాంస్కృతిక మార్పిడి, ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతోంది. ఆధ్యాత్మిక శాంతి, జ్ఞానోదయం కోసం ప్రయత్నిస్తున్నవారికి ఇది ఒక ఆదర్శ స్థలం. హన్మకొండ జిల్లా కేంద్రంలో ఉన్న వేయి స్థంభాల గుడి, కాకతీయ రాజవంశం శిల్పకళా వైభవానికి నిదర్శనం. రుద్రదేవ మహారాజు 12వ శతాబ్దంలో నిర్మించిన ఈ గుడి శివుడు, విష్ణువు సూర్యదేవుడికి అంకితమైంది. ప్రత్యేకమైన త్రికూటాకార నిర్మాణంతో, నక్షత్ర ఆకారపు వేదికపై నిలిచి ఉంది. గర్భగుడి చుట్టూ 1000కు పైగా సున్నితంగా చెక్కబడిన స్థంభాలు ఉన్నాయి. ప్రధాన ఆకర్షణ ఏకశిలా నంది విగ్రహం, ఇది శిల్పుల నైపుణ్యాన్ని చాటుతుంది. ఈ దేవాలయం తురుష్కుల దండయాత్రలో కొంత భాగం నాశనమై, 20వ శతాబ్దంలో పునరుద్ధరించబడింది. ప్రాచీన భారతీయ వాస్తుశిల్పం అద్భుతమైన నమూనాగా నిలిచింది.

కాకతీయ రాజవంశం వాస్తుశిల్ప వైభవానికి అద్భుతమైన నిదర్శనమే వరంగల్ కోట. 13వ శతాబ్దంలో నిర్మించబడిన ఈ కోట కాకతీయుల రాజధానిగా, వ్యూహాత్మక స్థానంగా పనిచేసింది. 3 కిలోమీటర్లకు పైగా విస్తరించిన భవ్యమైన ప్రాకారాలు, దీని గొప్పతనాన్ని ప్రతిబింబిస్తాయి. కాకతీయ కళాతోరణం అనే సూక్ష్మశిల్పాలు కలిగిన తోరణం ఈ కోటకు ప్రత్యేక ఆకర్షణ. స్వయంభూ దేవాలయంలోని శివలింగం భక్తులకు పవిత్ర తీర్థస్థలం. కోటలోని ధాన్యాగారాలు, సరుకు గిడ్డంగులు ఆ కాలపు సంపదను తెలియ జేస్తున్నాయి. తెలంగాణ సంపన్న సాంస్కృతిక వారసత్వానికి ఈ కోట ఒక జీవంత ముద్ర. చారిత్రక ప్రాధాన్యత, శిల్ప సౌందర్యం కారణంగా ప్రతి ఒక్కరూ ఇక్కడికి తప్పక వెళ్లాల్సిన ప్రదేశంగా ఇది నిలిచింది. ములుగు జిల్లా పాలంపేట వద్ద ఉన్న రామప్ప గుడి, కాకతీయ సామ్రాజ్యం వాస్తు శిల్ప సంపదకు ప్రతీక. ఇది 13వ శతాబ్దంలో గణపతి దేవ మహారాజు పాలనలో నిర్మించబడింది. ఈ శివాలయానికి ప్రధాన శిల్పి రామప్ప పేరు మీదుగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి శిల్పాలు, సుందరమైన నృత్య ముద్రలు, పురాణ కథలను చిత్రించే శిల్పాకృతులు అద్భుతంగా ఉంటాయి. 2021లో యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలంగా గుర్తించబడిన ఈ దేవాలయం చుట్టూ సహజ సుందరమైన చెరువు, హరిత వనాలు ఉన్నాయి. పోచంపల్లి ప్రాంతంలో నేతన్న మేధస్సుతో తయారయ్యే పోచంపల్లి ఇక్కత్ చీరలు ప్రపంచ ప్రసిద్ధి చెందాయి. 200 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ నేతకళలో నూలు లేదా పట్టుదారాలను డైలో ముందుగా రంగు వేసి, సంక్లిష్టమైన జ్యామితీయ నమూనాలతో నేస్తారు. 120 దేశాల ప్రతినిధులు హాజరయ్యే.. 150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం అయ్యే మిస్ వరల్డ్ పోటీలు ఈవెంట్‌లో తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్, గ్రామీణ పర్యాటకంకు ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖంగా ప్రమోట్ చేసేందుకు , పెద్ద ఎత్తున విదేశీ పర్యాటకులను ఆకర్షించుకునేందుకు తద్వారా గ్రామీణ ముఖ చిత్రాన్ని మార్చేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. మిస్ వరల్డ్ పోటీలలో భాగంగా వరంగల్ , హన్మకొండ , ములుగు, యాదాద్రి భువనగిరి, మహబూబ్ నగర్ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను షోకేజ్ కు చేసేందుకు రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలను మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు సందర్శించనున్నారు. మిస్ వరల్డ్ ఈవెంట్‌లో భాగంగా ఈనెల 12న ఆధ్యాత్మిక టూరిజానికి చిహ్నంగా ఉన్న నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని, బుద్ధిష్ట థీమ్ పార్కును మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సందర్శించనున్నారు. అలాగే ఈ నెల 14న చారిత్రక, ఆధ్యాత్మిక నగరం వరంగల్‌లోని వెయ్యి స్థంభాల గుడి, వరంగల్ పోర్టును సందర్శిస్తారు. ఇదే
రోజు వరంగల్ జిల్లాలో యునెస్కో వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప ఆలయంను సందర్శిస్తారు.

# ఉగ్రవాదులకు జాతీయ జెండాతో అంత్యక్రియలు చేస్తారా



న్యూఢిల్లీ:పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' పేరుతో భారత్ చేపట్టిన సైనిక దాడుల్లో కేవలం ఉగ్రవాదులను మాత్రమే హతమార్చినట్లు- విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. పౌరులు చనిపోయారన్న పాకిస్థాన్ ఆరోపణలను ఆయన ఖండించారు. భారత సైనిక దాడుల్లో మరణించిన ముగ్గురు ఉగ్రవాదుల అంత్యక్రియలకు పాకిస్థాన్ ఆర్మీ అధికారులు హాజరైన చిత్రాన్ని విక్రమ్ మిస్రీ ప్రదర్శించారు. శవపేటికలపై పాకిస్థాన్ జెండాలు కప్పి ప్రభుత్వ లాంఛనాలతో పౌరులకు అంత్యక్రియలు నిర్వహిస్తారా అని ప్రశ్నించారు. మే 7న భారత్ జరిపిన సైనిక దాడులన్నీ జాగ్రత్తగా ఎంచుకున్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలు, ఉగ్రవాద లక్ష్యాలపైనే అని విక్రమ్ మిస్రీ స్పష్టం చేశారు. 'ఈ దాడుల్లో ఎవరైనా పౌరులు చనిపోతే, ఈ చిత్రం మీ అందరికీ ఎలాంటి సందేశాన్ని పంపుతుందో నాకు ఆశ్చర్యంగా ఉంది. ఇది అడగాల్సిన ప్రశ్న. పౌరుల అంత్యక్రియల్లో శవపేటికలపై పాకిస్థాన్ జెండాలు కప్పి, ప్రభుత్వ గౌరవం ఇవ్వడం కూడా వింతగా ఉంది. హతమైన వ్యక్తులు ఉగ్రవాదులే. అలాంటి ఉగ్రవాదులకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు బహుశా పాకిస్థాన్‌లో ఒక ఆచారం కావచ్చు. ఇది మాకు పెద్దగా అర్థం కాలేదు' అని అన్నారు. అలాగే మతపరమైన ప్రదేశాలపై భారత్ దాడి చేసిందన్న పాకిస్థాన్ ఆరోపణలను కూడా విక్రమ్ మిస్రి ఖండించారు. ఇది పూర్తిగా అబద్ధమని అన్నారు. కేవలం ఉగ్రస్థావరాలు లక్ష్యంగా దాడులు సాగాయని అన్నారు. ఇకపోతే పాక్ దాడులను సమర్థంగా తిప్పికొట్టామన్నారు. ఈ పాక్ సైన్యం కాల్పుల్లో 16 మంది మృతి చెందినట్లు తెలిపారు. పహల్గామ్ దాడులకు పాల్పడింది తామేనని ఆర్‌టిఎ ప్రకటించిందని, అది లష్కరే తోయిబాకు అనుబంధ సంస్థ అని తెలిపారు. అయితే, అంతర్జాతీయ సమాజానికి పాక్ తప్పుడు సమాచారం ఇస్తోందన్నారు. ఉగ్రవాదులతో
తమక సంబంధాలు లేవని పాక్ బుకాయిస్తోందన్నారు. పాక్‌లో టెర్రరిస్టులు లేరని ఆ దేశ మంత్రి నిస్సిగ్గుగా చెబుతున్నారని.. అనేక దాడుల్లో పాక్ ప్రమేయం ఉందని చాలా సార్లు రుజువైందని వివరించారు. ఉగ్రవాదులకు ఆశ్రయం ఇస్తున్నదే పాకిస్తాన్ అన్నారు. ముంబై సహా భారత్ లో జరిగిన పలు దాడులపై పాక్ హస్తం ఉందన్నారు. ఉగ్రవాదుల డిఎన్ఎ రికార్డులు, వారి అడ్రస్సులు పాక్‌కు అందించామని.. కానీ పాకిస్తాన్ ఏ అంశంలోనూ స్పందించేదని పేర్కొన్నారు. పాక్ ఏ తీవ్రతతో దాడి చేసిందో అదే తీవ్రతతో ప్రతిదాడి చేశామన్నారు.

# మూడేళ్లు గట్టిగా పోరాడితే ప్రభుత్వం మనదే

అమరావతి: మనం గట్టిగా నిలబడి మూడేళ్లు ఇలాగే పోరాడితే.. ఆ తర్వాత వచ్చేది కచ్చితంగా మన ప్రభుత్వమే అని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. చూస్తుండగానే ఏడాది గడిచింది. కళ్లు మూసుకుని తెరిస్తే మూడేళ్లు గడుస్తాయి.. మనం గట్టిగా నిలబడి మూడేళ్లు ఇలాగే పోరాడితే, ఆ తర్వాత వచ్చేది కచ్చితంగా మన ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు.. ఇప్పుడు మిమ్మల్ని వేధిస్తున్న వారెవ్వరినీ వదిలిపెట్టబోం.. మనం అధికారంలోకి వచ్చాక, వారిని చట్టం ముందు నిలబెడతామని స్పష్టం చేశారు..వైసీపీ కేంద్ర కార్యాలయంలో అన్నమయ్య జిల్లా రాజంపేట మున్సిపాలిటీ-, చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం, శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మున్సిపాలిటీ-, పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండల ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మున్సిపల్ చైర్ పర్సన్లు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్లు, కౌన్సిలర్లు, ఎంపీటీ-సీలతో పాటు- ఆయా జిల్లాల ముఖ్య నేతలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. నాడు-నేడు లేదు. ఇంగ్లీస్ మీడియం లేదు... పిల్లలకు ట్యాబ్‌లు లేవు. గోరుముద్ద సక్రమంగా లేదు.. గవర్నమెంట్
బడులు రివర్స్‌లోకి వెళ్లాయి.. పిల్లలు ఎదగాలంటే, ఆ కుటు-ంబం బాగు పడాలంటే, ఆ పిల్లవాడు బాగా చదవాలి అన్నారు వైఎస్ జగన్.. మన ప్రభుత్వంలో ప్రతి మూడు నెలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యాదీవెన ఇచ్చాం. అందుకే ప్రతి మూడు నెలలకు 700 కోట్లు-, అలా ఏటా 2800 కోట్లు-, వసతి దీవెన కింద మరో 1100 కోట్లు- ఇవ్వాలి.. ఇచ్చాం. కానీ, ఈ పెద్దమనిషి చంద్రబాబు గత ఏడాది 3900 కోట్లకు బదులు 700 కోట్లు- మాత్రమే ఇచ్చాడు.. ఈ ఏడాది ఏమీ ఇవ్వలేదు. దీంతో పిల్లలు చదువుకు దూరం అవుతున్నారు.. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారు. మనం పక్కాగా అమలు చేశాం.. ఇంకా ఆరోగ్య ఆసరా అమలు చేశాం. ఆరోగ్యశ్రీకి నెలకు 300 కోట్లు- కావాలి. రూపాయి ఇవ్వలేదు.. ఆరోగ్య ఆసరా ఇవ్వడం లేదు. దీంతో పేదలు వైద్యం కోసం అప్పులు చేయాల్సి వస్తోంది.. రైతులకు ఏ పంటకూ గిట్టు-బాటు- ధర రావడం లేదు. రైతు ఈరోజు దళారుల పాలయ్యాడు. టమోటా కిలో 2 కూడా రావడం లేదు. ఆర్బీకేలు నీరు గారిపోయాయి. ఉచిత పంటల బీమా లేదు అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.. గత ప్రభుత్వ హయాంలో ఎక్కడ ప్రకృతి వైపరీత్యం జరిగినా, ప్రభుత్వ యంత్రాంగం కనిపించేది.

వేగుచుక్క



# యుద్ధం మొదలు

న్యూఢిల్లీ/ఇస్లామాబాద్: అవమాన భారంతో విచక్షణ కోల్పోయిన దాయాది దిద్దుకోలేని పొరపాటు చేసింది. బుద్ధి తెచ్చుకోవాల్సింది పోయి పూర్తిగా బరితెగించింది. ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకారం చేయబోయి మరోసారి పరువు పోగొట్టుకుంది. భారత్‌ను సైనికంగా రెచ్చగొట్టే దుస్సాహసానికి పూనుకుని అభాసుపాలైంది. బుధవారం అర్ధరాత్రి దాటినప్పటి నుంచీ భారత్‌పై ఎడాపెడా వైమానిక దాడులకు దిగింది. క్షిపణులు, డ్రోన్ దాడులతో సరిహద్దు రాష్ట్రాల్లో పలు పౌర, సైనిక లక్ష్యాలను ధ్వంసం చేసేందుకు విఫలయత్నం చేసింది. వాటన్నింటినీ మన సైన్యం పూర్తిగా తిప్పికొట్టడమే గాక మూడు పాక్ యుద్ధ విమానాలను కూల్చేసింది. ఇద్దరు పాక్ పైలట్లను బందీలుగా పట్టుకుంది. రాజధాని ఇస్లామాబాద్‌తో పాటు కీలక పాక్ నగరాలపై ఒకే రోజు రెండుసార్లు క్షిపణి దాడులతో విరుచుకుపడింది. అక్కడి ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు తదితరాలను నేలమట్టం చేసింది. రెండు రోజుల వ్యవధిలో దాయాదికి వరుసగా రెండో పరాభవం రుచిచూపి మర్చిపోలేని గుణపాఠం నేర్పింది.

మరోవైపు నౌకాదళం కూడా రంగంలోకి దిగింది. పాక్‌కు జీవనాడి వంటి కరాచీ నౌకాశ్రయంపై ఐఎన్ఎస్ విక్రాంత్ యుద్ధనౌక బాంబుల వర్షం కురిపించి 10కి పైగా నౌకలను ధ్వంసం చేసినట్టు సమాచారం. 1971 పాక్ యుద్ధం తర్వాత కరాచీ నౌకాశ్రయంపై దాడి ఇదే తొలిసారి. అంతేగాక ఏకంగా 20కి పైగా భారత యుద్ధ నౌకలు పాక్ వైపు కదులుతున్నట్టు చెబుతున్నారు. ఎల్లలు దాటిన ఉద్రిక్తతల నడుమ పరిస్థితులు పూర్తిస్థాయి యుద్ధం దిశగా సాగుతున్నాయి. ఇరువైపుల నుంచీ కాల్పుల మోతతో సరిహద్దులు దద్దరిల్లిపోతున్నాయి. పౌర లక్ష్యాలపై పాక్ సైన్యం విచక్షణారహిత కాల్పులకు తెగబడుతోంది. అందుకు మన సైన్యం దీటుగా బదులిస్తోంది. ఇరు దేశాల్లోనూ సరిహద్దు రాష్ట్రాలు ఎయిర్ సైరన్లు, బాంబుల మోతతో దద్దరిల్లిపోతున్నాయి. పలు విమానాశ్రయాలు మూతబడ్డాయి. ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు నెలకొన్నాయి. అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిందిగా భద్రతా బలగాలను కేంద్రం ఆదేశించింది. సైనికులకు సెలవులు రద్దు చేశారు. కీలకమైన సైనిక తదితర మౌలిక వ్యవస్థల వద్ద రక్షణను కట్టుదిట్టం చేశారు. పాక్ అత్యంత అనాగరికంగా వ్యవహరిస్తోందంటూ కేంద్రం మండిపడింది. పౌర ఆవాసాలపై విచక్షణారహితంగా డ్రోన్లు, మిసైళ్లు ప్రయోగిస్తూ హమాస్ ఉగ్ర సంస్థను తలపిస్తోందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు దుయ్యబట్టాయి. జమ్మూ, పఠాన్‌కోట్, ఉద్ధంపూర్‌ల్లో పాక్ క్షిపణి, డ్రోన్ దాడి యత్నాలను పూర్తిగా తిప్పికొట్టినట్టు సైన్యం ప్రకటించింది. పరిస్థితి అదుపు తప్పుతున్న నేపథ్యంలో అమెరికా రంగంలోకి దిగింది. సంయమనం పాటించాల్సిందిగా ఇరు దేశాలకూ సూచించింది. పేట్రేగిన పాక్ సరిహద్దుల వెంబడి 15 సైనిక స్థావరాలపై దాడి యత్నాలు విఫలం కావడంతో గురువారం పాక్ మరింతగా పేట్రేగిపోయింది. రాత్రివేళ పాక్ ఫైటర్ జెట్లు భారత్‌పై తీవ్రస్థాయిలో దాడులకు తెరతీశాయి. రాజస్తాన్ మొదలుకుని జమ్మూ కశ్మీర్ దాకా సరిహద్దుల పొడవునా పలుచోట్ల సైనిక లక్ష్యాలతో పాటు విచక్షణారహితంగా పౌర ఆవాసాలపైనా గురిపెట్టాయి. శ్రీనగర్, జమ్మూ విమానాశ్రయాలను ధ్వంసం చేసేందుకు విఫలయత్నం చేశాయి. జమ్మూ%–%శ్రీనగర్ హైవేపై భారీ పేలుడు చోటుచేసుకుంది. రాజౌరీ జిల్లాలో పలుచోట్ల పేలుళ్లు విన్పించాయి. పాక్ దాడులన్నింటినీ సైన్యం సమర్థంగా అడ్డుకుంది. సత్వారీలోని జమ్మూ విమానాశ్రయం, సాంబా, ఆర్ఎస్ పుర, అర్నియా తదితర ప్రాంతాలపైకి కనీసం 8కి పైగా క్షిపణులు దూసుకొచ్చే ప్రయత్నం చేయగా మధ్యలోని అడ్డుకుని కూల్చేసినట్టు ప్రకటించింది. మన 'ఆకాశ్', ఎంఆర్ఎస్ఏఎంతో పాటు అత్యాధునిక ఎస్%–%400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ పాక్ క్షిపణులు, డ్రోన్లను ఎక్కడివక్కడ కూల్చేశాయి. పఠాన్‌కోట్‌లో రెండు, జమ్మూలో ఒక పాక్ యుద్ధ విమానాన్ని ఎస్%–%400 వ్యవస్థ నేలకూల్చింది. వాటిలో రెండు జేఎఫ్%–%17, ఒక ఎఫ్%–%16 ఉన్నాయి. రెండు యుద్ధ విమానాలను నష్టపోయినట్టు పాక్ కూడా అంగీకరించింది. పఠాన్‌కోట్‌లో ఇద్దరు పైలట్లు మన బలగాలకు చిక్కినట్టు సమాచారం. ఆ వెంటనే పాక్‌పై సైన్యం విరుచుకుపడింది. ఇస్లామాబాద్, లాహోర్, సియాల్‌కోట్, కరాచీ, రావల్పిండిలపై దీర్ఘశ్రేణి క్షిపణులతో రెండోసారి భారీస్థాయిలో దాడులకు దిగింది. లాహోర్ తదితర నగరాల్లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలన్నింటినీ సమూలంగా నాశనం చేసేసింది. పాక్‌లోని పంజాబ్ ప్రాంతంలో నెలకొన్న కీలక ఎయిర్‌బోర్న్ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టం (ఏడబ్ల్యూఏసీఎస్)ను తుత్తునియలు చేసింది. పాక్ నగరాలు బాంబు పేలుళ్లతో దద్దరిల్లినా పౌర ఆవాసాలు, వ్యవస్థలకు నష్టం కలగని రీతిలో సైనిక వ్యవస్థలను మాత్రమే ఎంచుకుని అత్యంత కచ్చితత్వంతో దాడులు నిర్వహించినట్టు సైన్యం పేర్కొంది. పలుచోట్ల బ్లాకౌట్ పాక్ దాడుల నేపథ్యంలో గురువారం రాత్రి సరిహద్దు

రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో సైరన్ల మోత మోగింది.

జమ్మూ కశ్మీర్, పంజాబ్, హరియాణా, రాజస్తాన్, గుజరాత్‌ల్లో పలుచోట్ల వైమానిక దాడుల హెచ్చరికలు జారీ అయ్యాయి. దాంతో పంజాబ్‌లోని పఠాన్‌కోట్, జలంధర్, అమృత్‌సర్, హొషియార్‌పూర్, మొహాలీ, చండీగఢ్ మొదలుకుని రాజస్తాన్‌లోని జైసల్మేర్ దాకా పలు నగరాల్లో కరెంటు సరఫరా నిలిపేశారు. ఆయాచోట్ల రాత్రిపూట పలు డ్రోన్లతో పాటు పేలుడు శబ్దాలను గమనించినట్టు భద్రతా బలగాలు తెలిపాయి. ప్రజలు లైట్లన్నీ ఆర్పేసి ఇళ్లకే పరిమితం కావాలని పేర్కొన్నాయి.

# దివ్యాంగులకు వీల్ చైర్ లు పంపిణీ.

- "స్నేహ సొసైటీ"లో రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్ ఆధ్వర్యంలో కార్యక్రమం.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 8:**






నగరంలోని మారుతి నగర్ లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్, నిజామాబాద్ ఆధ్వర్యంలో గురువారం సెరిబ్రల్ పాలసీ దివ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లోక రమణ్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. నేటి సమాజంలో మనం ఎంతసేపు మన గురించే ఆలోచిస్తామని, మహా అంటే మన కుటుంబం గురించి ఆలోచిస్తామని, కానీ పక్క వాళ్ళ అవసరాలు మరియు కష్టాల గురించి చాలా తక్కువ మంది ఆలోచించి, వారి కష్టాలకు స్పందించి సేవలందిస్తారని, అలాంటి మహనీయులకు అభినందనలు తెలిపారు. స్నేహ సొసైటీ మరియు రోటరీ క్లబ్ లాంటి సంస్థలు, కష్టాల్లో మరియు ఇబ్బందుల్లో ఉన్న వ్యక్తులను, దివ్యాంగులను గుర్తించి వారికి అవసరమైన సేవ చేయడం అభినందనీయం అన్నారు. దివ్యాంగుల పిల్లలకు సేవా భావంతో మరియు అంకితభావంతో, సేవలందిస్తున్న స్నేహ సొసైటీని ఆయన అభినందించారు. నడవడానికి కూడా ఒకరి తోడు అవసరం ఉన్న సెలెబ్రల్ పాలసీ పిల్లలు సొంతంగా బయటికి బయటికి కానీ, పాఠశాలకు కానీవెళ్లడానికి అవసరమైన వీల్ చైర్లను పంపిణీ చేసిన రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్, నిజామాబాద్ వారికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. స్నేహ సొసైటీ కి ఎలాంటి అవసరాలు ఉన్న తనను సంప్రదించితే వారికి తన సహకారాన్ని అందిస్తామని తెలియజేశారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పద్మ శ్రీనివాస్ అధ్యక్షుడు రోటరీ క్లబ్ జేమ్స్ నిజామాబాద్ మాట్లాడుతూ, తాను స్నేహ సొసైటీ సహకారంతో వీల్ చైర్లు అవసరం ఉన్న దివ్యాంగులను గుర్తించి వారికి ఈరోజు వీల్ చైర్లను అందించడం జరిగిందని తెలిపారు. సెరెబ్రల్ పాల్సి వైకల్యంతో బాధపడుతున్న 8 మంది పాఠశాలల్లో చదువుకునే దివ్యాంగులకు, వీల్ చైర్ లను పంపిణీ చేయడం జరిగింది. రాబోయే రోజుల్లో రోటరీ క్లబ్ ద్వారా స్నేహ సొసైటీలో చదువుకునే దివ్యాంగులకు, సహాయ పరికరాలు అందిస్తామని తెలిపారు.

అనంతరం ఎనిమిది మంది సెరెబ్రల్ పాల్సి, దివ్యాంగులకు ముఖ్య అతిథి చేతుల మీదుగా వీల్ చైర్లను అందించారు. ఈ కార్యక్రమంలో స్నేహ సోసైటీ కార్యదర్శి, ఎస్ సిద్దయ్య, రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్,నిజామాబాద్ కార్యదర్శి, గౌరీ శంకర్ స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి, రోటరీ క్లబ్ జేమ్స్ వ్యవస్థాపకుడు రంజిత్ సింగ్ చౌహాన్, రొటేరియన్ చంద్రశేఖర్, దివ్యాంగులు వారి తల్లిదండ్రులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి.




టియుసిఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కే.సూర్యం.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మే 8:**

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని టియుసిఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కే.సూర్యం కోరారు. ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం కోసం ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా కమిటీ సమావేశం శ్రామిక భవన్, కోటగల్లిలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సూర్యం మాట్లాడుతూ, గత 11 సంవత్సరాల బీజేపీ ప్రభుత్వ పాలనలో కార్మికుల జీవన ప్రమాణాలు పడిపోయాయన్నారు. అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగినాయని, కానీ కార్మికుల వేతనాలు పెరగలేదన్నారు. కార్మికులకు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కరువైందన్నారు. మోడీ ప్రభుత్వం అవలంబించిన కార్పోరేట్ కంపెనీల అనుకూల, కార్మిక వ్యతిరేక విధానాలే ఇందుకు కారణమన్నారు. మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, కనీస వేతనాల అమలు కోసం, కనీస పెన్షన్ 9వేల అమలు కోసం, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా, పనిగంటల పెంపుదలకు వ్యతిరేకంగా జాతీయ కార్మిక సంఘాలు ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. ఈ సమ్మెలో జిల్లాలోని కార్మికులందరూ పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న డి.రాజేశ్వర్ జిల్లా నాయకులు లక్ష్మణ్, సాయన్న, రెహానా, రాజేశ్వర్, కిరణ్, విటల్, లింగం తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టుల మందు పాతరకు కామారెడ్డి కానిస్టేబుల్ బలి.

**పెళ్లైన ఏడాది లోపే వడ్ల శ్రీధర్ మృతి.**

**పాల్వంచ మండల కేంద్రంలో తీవ్ర విషాదం.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మే 8:**



ములుగు జిల్లా వాజేడు ప్రాంతంలో కూంబింగ్ చేస్తున్న సమయంలో మావోయిస్టులు అమర్చిన ల్యాండ్ మైన్ కు కామారెడ్డి జిల్లా, పాల్వంచ మండల కేంద్రానికి చెందిన వడ్ల శ్రీధర్ ప్రాణాలు కోల్పోయాడు. శ్రీధర్ మృతితో గ్రామంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ల్యాండ్ మైన్ పేలి మృతి చెందిన ముగ్గురు గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్ల లో పాల్వంచ గ్రామానికి చెందిన వడ్ల శ్రీధర్ ఉన్నాడన్న విషయం తెలియగానే గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామంలోనీ లక్ష్మి, గంగారాం దంపతులకు శ్రీధర్ రెండవ సంతానం, కాగా నాలుగు సంవత్సరాల క్రితం శ్రీధర్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి గ్రేహౌండ్స్ లో చేరాడు. గత ఏడాది ఆగస్టు నెలలో శ్రీధర్ కు వివాహం జరిగింది. ఇంతలోనే మావోయిస్టుల దాడిలో మృతి చెందడం పట్ల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. చాలా కష్టపడి సాధించుకున్న ఉద్యోగంలో చేరిన శ్రీధర్ విధి నిర్వహణ లోనే అసువులు బాయడం బాధాకరం అని గ్రామస్తులు తమ విచారాన్ని వెలిబుచ్చారు.

# పివోకె స్వాధీనంతో పాక్‌కు బుద్ధి చెప్పాలి

ఒక్క ఆపరేషన్ సిందూర్‌తో పాక్ దుష్టబుద్ధిని అణచివేయలేం. ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్న తీరును దారికి తేలేము. దాని వక్రబుద్ధిని మార్చలేము. భారత్‌తో పెట్టుకుంటే ఇక జీవితం లేదన్న రీతిలో తగిన బుద్ధి చెప్పాలి. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను సంపూర్ణంగా శాశ్వతంగా సాధించాలి. ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేయాలి. జీవితంలో మళ్లీ కోలుకోలేని విధంగా బుద్ధి చెప్పాలి. ఇది అంత సులవయిన పని కాకున్నా ఇందుకు మనం కొంత త్యాగం చేయక తప్పదు. పివోకెపుశాశ్వతంగా స్వాధీనం చేసుకుంటే తప్ప పాక్‌ను కట్టడి చేయలేమని మోడీ గుర్తించాలి. మల్లిఖార్జున ఖర్గే లాంటి వారు నోరు మూసుకుంటే మంచిది. పహల్గామ్ దాడి తరవాత ఆయన చేసిన వ్యాఖ్యలు క్షంతవ్యం కాదు. ఇకపోతే పాక్ను దారికి తేవాలంటే శాశ్వతంగా దాని మెడలు వంచాల్సిన అవసరం ఉంది. అది ఎప్పుడో జరగాల్సి ఉన్నా..నెహ్రూ, ఇందిరల నిర్వాకం వల్ల భారత్ ఎంతో మూల్యం చెల్లించుకుంది. నెహ్రూను ప్రధానిని చేయడం లక్ష్యంగా గాంధీ అనుసరించిన విధానం కారణంగా జిన్నా పాక్ ఏర్పాటును బలంగా తీసుకుని వెళ్లారు. ఆంగ్ల పాలకులుకూడా ఇదే అదనుగా దేశాన్ని అడ్డంగా విభజించి గీతలు గీసారు. దీనిని ఆనాటి నాయకులు ఏ రకంగానూ వ్యతిరేకించలేదు. దేశ విభజన ఓ చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. విభజన సందర్భంగా వేల్లలో ముస్లింలు పాక్ వైపు వెళితే..లక్షల్లో హిందువుల శవాలు భారత్‌కు తరలించారు. ఆనాటి ఊచకోత గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఇలా ఊచకోతలు, బలవంతపు మతమార్పిళ్లతో ఇస్లామిక్ రాజ్యంగా అవతరించిన పాక్ ఆదినుంచీ భారత్ వ్యతిరకతను నరనరాన జీర్ణించుకుంది. కాశ్మీర్‌లో కొంత భాగాన్ని ఆక్రమించింది. దానిని పరిష్కరించలేక పోయిన నెహ్రూ 370 ఆర్టికల్‌తో కొత్త సమస్యలు తెచ్చి పెట్టారు. ఈ సమస్యను పరిష్కరించడానికి వచ్చిన ప్రతి అవకాశాన్ని నాటి కాంగ్రెస్ పాలకులు జారవిడుచుకున్నారు. ఇప్పుడు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను తిరిగి స్వాధీన పర్చుకుంటే తప్ప పాక్ కోరలు పీకలేం. ప్రస్తుత పరిస్థితుల్లో యుద్ధమంటూ జరిగితే ..అది పివోకెను ఆక్రమించుకునేదిగా మాత్రమే ఉండాలి. కశ్మీర్‌తో భారత్‌కు పురాతన కాలం నుంచీ ఉన్న అవినాభావ సంబంధం గురించి తెలిసినా పాకిస్తాన్ పాలకులు తమ మనుగడకోసం, రాజకీయాలకోసం మతాన్ని, కశ్మీర్‌ను ఉపయోగించుకుంటూనే ఉన్నారు. అంతర్జాతీయంగా యాగీ చేస్తున్నారు. పివోకెలో ఉగ్రశిబిరాలను ఏర్పాటు చేసి దాడులకు ఉసిగొల్పుతున్నారు. చివరకు ఆపరేషన్ సిందూర్‌లో మరణించిన ఉగ్రవాదకలు పాక్ సైనికులు సలాం కొట్టారు. భారతదేశాన్ని శత్రువుగా, ముస్లింల వ్యతిరేకిగా చిత్రిస్తూ పబ్బం గడుపు కోవడమే పనిగా పెట్టుకుని ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాక్‌కు గర్వభంగా చేయాలి. దాని ఉనికిని సవాల్ చేయాలి. కుంటూనే ఉన్నారు. భారత్ నుంచి విడిపోయి పాక్‌గా ఏర్పడ్డ పాక్... భారతదేశం తమకు శత్రువని పదేపదే రుజువు చేసుకుంటోంది. పాక్ సైనికాధికారులు ఎప్పుడూ భారత వ్యతిరేకతను నూరిపోస్తున్నారు. తాజాగా ఇటీవల పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. భారత వ్యతిరేకతే జాతీయ వాదంగా ప్రజల్ని ప్రభావితం చేసేందుకు పాక్ ప్రభుత్వాలు, సైన్యం, ఇంటలిజెన్స్ సంస్థలూ నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నాయి. ప్రమాదకర ఉగ్రవాద శక్తుల్ని పోషిస్తున్నాయి. కాశ్మీర్‌పై అక్కసు వెళ్లగక్కు తున్నాయి. ఐక్యరాజ్యసమితిలో పదేపదే ప్రస్తావించి భంగపడ్డా పాక్‌కు బుద్ధ ఇరావడం లేదు. 1971లో జరిగిన యుద్ధంతో బంగ్లాదేశ్ ఆవిర్భావం జరిగినా...పాక్ వంకర బుద్ధిని మార్చుకోలేదు. 1999లో కార్గిల్‌లో చొరబాటుకు పాల్పడి దెబ్బతిన్నా పాకిస్థాన్ పాలకుల మనస్తత్వం మారడంలేదు. ఉగ్రవావాలను పెంచి పోషించడంతో పాటు అబోటాబాద్‌లో లాడెన్‌కు ఆశ్రయమిచ్చి దాచి పెట్టాయి. అమెరికన్ దళాలు ఒసామాబిన్ లాడెన్‌ను హతమార్చిన తర్వాత కూడా పాక్ సైన్యం బుద్ధి మారడం లేదు. పొరుగుదేశాల్లో హింసాత్మక చర్యలను ప్రోత్సహించడం ద్వారా పాకిస్థాన్ తన అంతర్గత భద్రతకే ముప్పు తెచ్చుకుం టుందని తెలిసి కూడా కుక్కతోక వంకరలా బుద్ధి మార్చుకోవడం లేదు. పాక్ బడ్జెట్‌లో 30శాతానికి పైగా సైన్యానికి ఖర్చుపెడుతున్నా, విద్య, ఆరోగ్యం, సంక్షేమ రంగాల్లో నిధులు తగ్గిపోయినా, ఆర్థిక ప్రగతి కునారిల్లినా, ఆసియాలోనే అత్యంత ఎక్కువ స్థాయిలో పెరుగుతున్న జనాభాలో దాదాపు 41 శాతం పేదరికంలో మగ్గుతున్నా ఆ దేశ పాలకులు, సైన్యం తమ మనుగడకోసం మతాన్ని ఆయుధంగా వాడుకుని భారత్‌లో హింసాత్మక చర్యలకు పాల్పడడం మానకోవడం లేదు. ఈ క్రమంలోనే పహల్గామ్ ఊచకోతకు దారితీసింది. హిందువులను పేరుపెట్టి క్రూరంగా చంపిన ఘటనకు పాక్‌ను ఎంతగా ధ్వంసం చేసినా తక్కువే. అందుకే ఇప్పుడు సిందూర్‌తోనే మన దాడి ఆగకూడదు. ఇలాంటి దాడులు కొనసాగాలి. మనం కొంత నష్టపోయినా శాశ్వత పరిష్కారం దిశగా పనిచేయాలి. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనం చేసుకోవాలి. భారత్‌లో జోక్యం చేసుకోకుండా, ఉగ్రవాదులను ప్రోత్సహించ కుండా కట్టడి చేయాలి. ఆర్థికంగా పూర్తిగా దెబ్బతీసి అడుక్కుతినేలా చేయాలి. ఎందుకంటే ఒక్క పాక్ వల్లనే భారత్ ఎంతగానో నష్టపోయింది. పహల్గాం ఉగ్రదాడి ఉచ్చు తమచుట్టూ బిగుస్తోందని, భారత్ నుంచి ప్రతీకార దాడి తప్పదని లోలోపల పాక్ బెంబేలెత్తుతున్నా పైకి మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శి స్తోంది. ఈ క్రమంలో పాక్ ఆర్మీ చీఫ్ అసీం మునీర్ ప్రేలాపనలు చేస్తూనే ఉన్నాడు.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...



# ఏం ప్లాన్ చేస్తున్నారో?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం 22' ప్రిపరేషన్ పనుల్లో బిజీగా ఉన్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్ లో అట్లీ కుమార్ దర్శకత్వంలో ఈ భారీ చిత్రం తెరకెక్కనుంది. 'పుష్ప 2' తర్వాత బన్నీ.. 'జవాన్' తర్వాత అట్లీ కలిసి చేస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే రిలీజైన అనౌన్స్ మెంట్ వీడియో అందర్నీ ఆశ్చర్యపరిచింది. ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ ప్రాజెక్ట్ త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుంది. అయితే ఇప్పుడు సడన్ గా బన్నీ ఓ బాలీవుడ్ స్టార్ హీరో ఇంట్లో ప్రత్యక్షం అవడం అనేక ఊహాగానాలకు తెర తీసింది.

'పుష్ప 2' మూవీతో ఇండియన్ ఇండస్ట్రీ రికార్డ్ క్రియేట్ చేసిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్.. తన స్టార్ డమ్ ను నెక్స్ట్ లెవెల్ కి తీసుకెళ్లే ప్లానింగ్ తో ఉన్నారు. ఇందులో భాగంగా కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ కుమార్ తో '22' చిత్రాన్ని అనౌన్స్ చేసారు. ఇదొక ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్ అని బన్నీ ఇటీవలే క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి. అయితే ఇప్పుడు ఉన్నట్టుండి అల్లు అర్జున్ బాలీవుడ్ స్టార్ హీరో ఇంటికి వెళ్లడం టాక్ ఆఫ్ ది బీటౌన్ గా మారింది.

2' సినిమా పనుల కోసం అల్లు అర్జున్ హైదరాబాద్ నుంచి ముంబైకి, అక్కడి నుంచి దుబాయ్ కి అన్నట్లుగా తిరుగుతున్నారు. ఇప్పుడు బాంబేలోనే ఎక్కువగా ఉంటున్న బన్నీ.. తాజాగా బాలీవుడ్ అగ్ర హీరో ఆమిర్ ఖాన్‌ను కలిశారు. స్వయంగా ఆయన నివాసానికి వెళ్లి కొంత సమయం ముచ్చటించారు. వీరిద్దరూ కలిసి దిగిన ఓ ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అగ్ర హీరోలిద్దరూ ఎందుకు మీట్ అయ్యారో? ఏం మాట్లాడుకున్నారో? అనేది తెలియదు కానీ.. ఆమీర్ ఇంట్లో అల్లు అర్జున్ కనిపించడం అనేక ఊహాగానాలు ప్రచారంలోకి రావడానికి కారణమైంది.

అల్లు అర్జున్ – అట్లీ సినిమాని హాలీవుడ్ స్టాండర్డ్స్ లో భారీ స్థాయిలో రూపొందించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. స్టార్ క్యాస్టింగ్, టాప్ నాచ్ టెక్నిషియన్స్ ఈ ప్రాజెక్ట్ లో భాగం అవుతున్నారు. అయితే ఇప్పుడు అమీర్ ఖాన్ తో బన్నీ భేటీ అవ్వడంతో.. 22' సినిమాలో బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ ఏదైనా స్పెషల్ రోల్ లో కనిపించే అవకాశం ఉందా? అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆమీర్ ఖాన్ సినిమాలో అల్లు అర్జున్ నటించే ఛాన్స్ ఉందా? అనే డౌట్స్ కూడా వినిపిస్తున్నాయి.

ఆమిర్ ఖాన్ తన డ్రీమ్ ప్రాజెక్ట్ గా 'మహా భారతం' తెరకెక్కించాలని ఎప్పటినుంచో అనుకుంటున్నారు. ఇటీవల ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. కొన్ని పార్ట్స్ గా తీసుకొస్తానని, వివిధ దర్శకులు వర్క్ చేస్తారని.. పలువురు స్టార్ హీరోలు భాగం కానున్నారని తెలిపారు. ఇప్పుడు అల్లు అర్జున్ – ఆమీర్ కలవడంతో.. మహా భరతం ప్రాజెక్ట్ లో బన్నీ నటించనున్నారా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

# చిరంజీవికి సూటి ప్రశ్న..



మెగాస్టార్ చిరంజీవి, అలనాటి అందాల తార శ్రీదేవి హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా 'జగదేకవీరుడు అతిలోకసుందరి'. కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సోషియో ఫాంటసీ మూవీ.. 1990లో విడుదలై ఎన్నో సంచలనాలు సృష్టించింది. తుఫాన్ ను సైతం లెక్క చేయకుండా బాక్సాఫీస్ లెక్కలను సరి చేసింది. తెలుగు చిత్ర సీమలో క్లాసిక్ సినిమాల జాబితాలో చేరిపోయింది. అలాంటి ఎవర్ గ్రీన్ మూవీని ఆధునిక సాంకేతిక మెరుగులద్ది మరోసారి థియేటర్లలోకి తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో దర్శక నిర్మాతలతో కలిసి చిరంజీవి ఓ స్పెషల్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు.

'జగదేకవీరుడు అతిలోకసుందరి' సినిమా మే 9వ తేదీకి 35 ఏళ్లు పూర్తి చేసుకోనుంది. ఈ నేపథ్యంలో అదే రోజున భారీ ఎత్తున థియేటర్లలో రీ-రిలీజ్ చేస్తున్నారు. 2డీతో పాటుగా 3డీలోనూ విడుదల చేస్తున్నారు. దీని కోసం వైజయంతీ మూవీస్ సంస్థ కొత్త సినిమా రేంజ్ లో ప్రమోషన్స్ చేస్తోంది. సినిమా విశేషాలతో పాటుగా తెర వెనుక జరిగిన కథలను తెలియజేస్తూ వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. ఈ క్రమంలో చిరంజీవి, రాఘవేంద్రరావు, నిర్మాత అశ్వినీ దత్ లతో యాంకర్ సుమ ఓ ఇంటర్వ్యూ నిర్వహించింది. దీనికి సంబంధించిన ప్రోమో తాజాగా విడుదలైంది.

మ్యాజికల్ రీయూనియన్ అని పేర్కొన్న ఈ వీడియోలో.. "మానవా అనడం మానవా నువ్వు.. చంపుతున్నావ్" అంటూ చిరంజీవి ఎంట్రీ ఇస్తారు. సుమని పలు రకాల భాషల్లో పలకరిస్తూ.. సినిమాలో గైడ్ రాజు పాత్ర కోసం 35 ఏళ్ల క్రితం నేర్చుకున్నానని అన్నారు. ఈ సందర్భంగా 'జగదేకవీరుడు అతిలోకసుందరి' సినిమా చేసే అవకాశం ఇచ్చినందుకు చిరు – అశ్వినీదత్ లకు రాఘవేంద్రరావు కృతజ్ఞతలు తెలిపారు. ఇళయరాజా జగదేక వీరుడు అయితే.. ఆయన సంగీతం అతిలోక సుందరి అని దర్శకేంద్రుడు కొనియాడారు.

"సూపర్ తీశారు.. ఏం తమాషా ఏంటి? మా బాస్ ని ఇరగదీసేశారు" అంటూ చిరంజీవి ఉత్తరాంధ్ర స్లాంగ్ లో మాట్లాడి అలరించారు. చివర్లో రామ్ చరణ్ ఎంట్రీ ఇచ్చి "మాకు తెలుసుకోవాలని ఉంది? ఆ రింగ్ ఏమైంది? ఆ చేప ఏమైంది? 35 సంవత్సరాలు అయింది. దీనికి జవాబు ఆ ఒక్కరే ఇవ్వగలుగుతారు" అని అంటారు. ఈ ప్రోమో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇది నెట్టింట వైరల్ అవుతోంది. రేపు మే 8న ఫుల్ ఇంటర్వ్యూని షేర్ చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు.

# రిలీజ్‌కు ముందే బయటపడ్డ సమంత?



శుభం సినిమాతో సమంత నిర్మాతగా మంచి సక్సెస్ అయితే సాధించేలా ఉంది. సినిమా సంగతి ఎలా ఉన్నా కూడా బిజినెస్, నాన్ థియేట్రికల్ హక్కులు మాత్రం బాగానే ఉన్నాయని సమాచారం. శుభం మూవీకి అయిన బడ్జెట్ కూడా చాలా తక్కువే అని టాక్. ఆ మొత్తం కూడా నాన్ థియేట్రికల్ ద్వారా వచ్చేసిందని అంటున్నారు. సమంత ప్రస్తుతం నిర్మాతగా 'శుభం' మూవీతో ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. మే 9న ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నార. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వంలో ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద సమంత 'శుభం' చిత్రాన్ని నిర్మించింది. ఈ చిత్రంలో హర్షిత్ రెడ్డి, శ్రీనివాస్ గవిరెడ్డి, చరణ్ ముఖ్య పాత్రల్లో నటించారు. శ్రావణి, శ్రియా, షాలినీ ఫీమేల్ లీడ్స్‌గా నటించారు. ఇక ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా సమంత ఎన్నో విషయాల్ని పంచుకున్నారు.సమంత తన మనసుకు నచ్చితేనే ఏ సినిమా అయినా చేశానని చెప్పుకొచ్చింది. శుభం చిత్రానికి సంబంధించిన కథతో చాలా కనెక్ట్ అయ్యానని, సీరియల్స్ అంటే మహిళలంతా కనెక్ట్ అవుతారని, చిన్నప్పుడు తాను కూడా ఇంగ్లీష్ సీరియల్ చూస్తుండే దాన్ని అని చెప్పుకొచ్చింది. తాను పెరిగి పెద్ద టీనేజ్‌లోకి వచ్చినా కూడా ఆ సీరియల్ మాత్రం కంప్లీట్ కాలేదని, ఇంకా సాగదీస్తూనే ఉన్నారని సమంత నవ్వేసింది.

ఇందులో సోషల్ సెటైర్లు ఉంటాయని, తాను ఎప్పుడూ కూడా సోషల్ మెసెజ్‌లు ఇవ్వాలని అనుకోలేదని తెలిపింది. ఇక సమంత వైజాగ్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఎంత ఆనందంగా, సంతోషంగా కనిపించిందో అందరికీ తెలిసిందే. ఇక శుభం టీంతో కలిసి సమంత స్టేజ్ మీదే స్టెప్పులు వేసింది. తన టీం అంతా కూడా గత వారం రోజుల నుంచి నిద్రలేని రాత్రులు గడుపుతోందని, వారిని చూస్తుంటే ఎంతో గర్వంగా, గౌరవంగా ఉందని చెప్పుకొచ్చింది. ఇక సమంత ఇప్పుడు నిర్మాతగా మొదటి ప్రాజెక్టుతో సేఫ్ అయినట్టుగా తెలుస్తోంది. రిలీజ్‌కు ముందుగానే టేబుల్ ప్రాఫిట్స్ ఉందని సమాచారం. డిజిటల్, శాటిలైట్ రైట్లతోనే సమంత గట్టెక్కిందని అంటున్నారు. ఇక థియేటర్ నుంచి వచ్చేదంతా కూడా బోనస్ అని తెలుస్తోంది. అంటే సమంతకు మొదటి సినిమా మంచి లాభసాటిగానే ఉందని చెప్పుకోవచ్చు. ఇలానే కంటెంట్‌ను నమ్ముకుని కొత్త వారితో ప్రయోగాలు చేస్తే పెద్ద రిస్క్ ఏమీ ఉండకపోవచ్చు.

# వంద కోట్ల క్లబ్బులో 'రెట్రో'..



సూర్య, కార్తిక్ సుబ్బరాజ్ కాంబోలో రెట్రో మూవీ మే 1న వచ్చిన సంగతి తెలిసిందే. రెట్రో సినిమాకు మిక్స్డ్ టాక్ వచ్చింది. ఈ మూవీకి వచ్చిన టాక్‌కి.. నిర్మాతలు వదులుతున్న పోస్టర్లకు సంబంధం లేకుండా ఉంది. డే వన్ ఎంత వచ్చిందో ప్రకటించారు. మళ్లీ గ్యాప్ ఇచ్చి ఏకంగా వంద కోట్ల పోస్టర్‌ను రిలీజ్ చేశారు. రెట్రో చిత్రానికి 104 కోట్లకు పైగా గ్రాస్ వచ్చిందని పోస్టర్ రిలీజ్ చేయగా.. అది ప్రస్తుతం వైరల్ అవుతోంది.

సూర్య, పూజా హెగ్డే కాంబోలో తెరకెక్కిన రెట్రో చిత్రం మే 1న విడుదలైంది. రెట్రో మూవీకి మిక్స్డ్ టాక్ వచ్చిన సంగతి తెలిసిందే. తెలుగులో అయితే రెట్రోకి డిజాస్టర్, డివైడ్ టాక్ వచ్చింది. తమిళంలో ఓ మోస్తరుగా పర్వాలేదనిపించే టాక్‌ను సొంతం చేసుకుంది. కార్తిక్ సుబ్బరాజ్‌కి, సూర్యకి కమర్షియల్ హిట్ లేక చాలా కాలమే అవుతోంది. ఈ ఇద్దరికీ రెట్రో మూవీతో మంచి సక్సెస్ వస్తుందని అంతా అనుకున్నారు. కానీ రెట్రో మూవీ ఆశించిన టాక్‌ను సొంతం చేసుకోలేకపోయింది.

రెట్రో మూవీకి డే వన్ మంచి వసూళ్లు వచ్చాయని ప్రకటించారు. కేవలం తమిళ నాడులోనే 17 కోట్లకు పైగా గ్రాస్ వచ్చిందని, అదే సూర్య కెరీర్ హయ్యస్ట్ అని అన్నారు. ఇక వరల్డ్ వైడ్‌గా రెట్రో మూవీకి 45 కోట్లకు పైగా గ్రాస్ వచ్చిందని తెలిపారు. ఇక మళ్లీ రెండో రోజు, మూడో రోజు, నాలుగో రోజు వసూళ్లను ప్రకటించలేదు. ఇప్పుడు ఏకంగా వంద కోట్ల క్లబ్బులో జాయిన్ అయిందని పోస్టర్ రిలీజ్ చేశారు.

ఇక ఇప్పుడు రెట్రో మూవీకి తెలుగులో అయితే ఆదరణ ఏమీ కనిపించడం లేదు. అసలు ఈ మూవీ ఒకటి రిలీజ్ అయిందనే విషయాన్ని కూడా పట్టించుకోవడం లేదు. ఇక్కడంతా కూడా నాని హిట్ 3 సందడి కనిపిస్తోంది. గత నాలుగైదు రోజుల నుంచి హిట్ 3 టాలీవుడ్ బాక్సాఫీస్‌కి ఊపిరిపోస్తోంది. ఏప్రిల్ నెలలో టాలీవుడ్ అంతా వెలవెలబోయింది. ఇక ఈ హిట్ 3 మూవీతో ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద సందడి అయితే కనిపిస్తోంది.

సూర్య రెట్రో మూవీని సోషల్ మీడియాలో జనాలు ఏకిపారేస్తున్నారు. కానీ కలెక్షన్స్ మాత్రం వస్తున్నాయని నిర్మాణ సంస్థ ప్రకటిస్తోంది. కలెక్షన్ల పోస్టర్ చూస్తుంటే మాత్రం నిర్మాతలైన సూర్య, జ్యోతికలకు మంచి లాభాలు అయితే వచ్చినట్టు అనిపిస్తోంది. రెట్రో మూవీ ఎక్కువ మందికి నచ్చిందని, చాలా తక్కువ మందికి నచ్చలేదని, నచ్చని వారికంటే నచ్చిన వారి సంఖ్యే ఎక్కువగా ఉందని, అది తనకు చాలా సంతోషంగా ఉందని కార్తిక్ సుబ్బరాజ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. మరి ఈ 104 కోట్లకు పైగా గ్రాస్ సాధించినట్టుగా ప్రకటించిన టీం.. ఏ ఏ ఏరియాల్లో ఎంతెంత వచ్చిందనే విషయాన్ని చెప్పడం లేదు. తెలుగులో మాత్రం ఈ మూవీకి దారుణమైన పరాభవం ఎదురైనట్టుగా తెలుస్తోంది. ఈ చిత్రంలో పూజా హెగ్డే లుక్స్, యాక్టింగ్‌పై విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ మూవీకి సంతోష్ నారాయణన్ మ్యూజిక్ అందించారు.

# సంక్రాంతికి వస్తున్నాం బాటలో...

నితిన్ హీరోగా, శ్రీలీల హీరోయిన్ గా నటించిన చిత్రం 'రాబిన్ హుడ్'. వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన ఈ సినిమాని మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్ తో నిర్మించింది. థియేటర్లలో ఫ్లాప్ అయిన ఈ హీస్ట్ కామెడీ ఇప్పుడు స్మాల్ స్క్రీన్ మీద అలరించడానికి రెడీ అయింది. తాజాగా మూవీ డిజిటల్ ప్రీమియర్ డేట్ ఫిక్స్ అయింది.

నితిన్ హీరోగా నటించిన రీసెంట్ మూవీ 'రాబిన్ హుడ్'. వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన ఈ హీస్ట్ కామెడీలో శ్రీలీల హీరోయిన్ గా నటించింది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ లో భారీ బడ్జెట్ తో రూపొందిన ఈ చిత్రం మార్చి 28న రిలీజ్ అయింది. ప్రమోషనల్ కంటెంట్ తో ఆడియన్స్ దృష్టించిన ఆకర్షించిన ఈ చిత్రం.. థియేటర్లలో పెద్దగా అలరించలేకపోయింది. మిక్స్డ్ టాక్ రావడంతో బాక్సాఫీస్ దగ్గర నిలబడలేకపోతుంది. దీంతో నితిన్ ఖాతాలో మరో ఫ్లాప్ గా మిగిలిపోయింది. అయితే ఇప్పుడు ఈ మూవీ స్మాల్ స్క్రీన్ మీదకు రావడానికి రెడీ అయింది.

'రాబిన్ హుడ్' సినిమా డిజిటల్ రైట్స్, శాటిలైట్ హక్కులు 'జీ గ్రూప్' దగ్గర ఉన్నాయి. ఇటీవల కాలంలో ఎంత పెద్ద హిట్టయిన సినిమా అయినా నెల తిరక్కుండానే ఓటీటీలోకి వచ్చేస్తున్నాయి. అందులోనూ బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలైంది కాబట్టి, నితిన్ మూవీ కూడా నాలుగు వారాల్లోనే డిజిటల్ ఫ్లాట్ ఫామ్ లోకి వస్తుందని అందరూ భావించారు. కానీ ఐదు వారాలు గడిచినా ఈ చిత్రాన్ని ఓటీటీలో అందుబాటులోకి తీసుకురాలేదు. తాజాగా ఈ మూవీ ఓటీటీ



స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్ అయింది.

ఇంతకముందు 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకి కూడా 'జీ' సంస్థ ఇదే స్ట్రాటజీ ఫాలో అయింది. వెంకటేష్, అనిల్ రావిపూడి కాంబోలో వచ్చిన ఈ చిత్రం సంక్రాంతికి బ్లాక్ బస్టర్ సక్సెస్ సాధించింది. ఆ తర్వాత ఒకేసారి జీ 5 ఓటీటీ, జీ తెలుగు ఛానల్స్ లో టెలికాస్ట్ అయింది. దీనికి రెండు వేదికల పైనా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. టీఆర్పీలో సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇప్పుడు 'రాబిన్ హుడ్' సినిమాకి కూడా అదే స్ట్రాటజీ ఫాలో అవుతున్నారు.

'రాబిన్‌హుడ్' సినిమాతో ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ తెరంగేట్రం చేసారు. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిషోర్, షైన్ టామ్ చాకో, మైమ్ గోపీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. జీవీ ప్రకాష్ సంగీతం సమకూర్చారు. థియేటర్లలో నిరాశ పరిచిన నితిన్ – శ్రీలీల చిత్రానికి ఓటీటీ, బుల్లితెర మీద ఎలాంటి ఆదరణ లభిస్తుందో వేచి చూడాలి.

# స్టెప్పులు వేసిన మహానటి



సమంత ప్రస్తుతం శుభం మూవీ కోసం బాగానే కష్టపడుతోంది. ప్రమోషనల్ సాంగ్‌లో సమంత వేసిన స్టెప్పుల్ని ఇప్పుడు వైరల్ చేస్తున్నారు. సమంత వేసినట్టుగా సెలెబ్రిటీలంతా స్టెప్పులు వేస్తూ శుభంని ముందుకు తీసుకు వెళ్తున్నారు. కీర్తి సురేష్ కూడా సమంత కోసం వచ్చింది. మే 9న స్పెషల్ డే అని కీర్తి సురేష్ గుర్తు చేస్తూ శుభంకి కంగ్రాట్స్ తెలిపింది.

సమంత ప్రస్తుతం 'శుభం' మూవీతో తన లక్‌ను టెస్ట్ చేసుకునేందుకు రెడీ అవుతోంది. ఇన్నేళ్లు నటిగా ఎన్నో సక్సెస్‌లు, ఫెయిల్యూర్స్ చూసింది సమంత. ఇక కరోనా టైంలో మయోసైటిస్‌తో బాధపడటం, ఆ తరువాత నటించేందుకు ఎక్కువ గ్యాప్ తీసుకోవడంతో ఇలా నిర్మాణంలోకి రావాలనే ఆలోచన వచ్చిందట. అలా నిర్మాతగా మారాలని అనుకున్నప్పుడు ఎన్నో కథల్ని వినేసిందట. అందులో ఈ 'శుభం' కథ మాత్రం తన మనసుని తాకిందని సమంత తెలిపింది.

వైజాగ్‌లో జరిగిన శుభం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సమంత సందడి చేసింది. శుభం టీంతో కలిసి సమంత స్టేజ్ మీద స్టెప్పులు వేసింది. ఇదొక ఫ్యామిలీ ఎంటర్టైనర్ అని, సినిమా చూసిన తరువాత అందరూ ఓ స్మైల్‌తో ఇంటికి వెళ్తారని సమంత చెప్పుకొచ్చింది. రెగ్యులర్ హారర్, కామెడీ టైపులో మాత్రం ఉండదని, ఈ చిత్రంపై తనకు ఎంతో నమ్మకం ఉందని సమంత తెలిపింది. ఈ మూవీ చాలా బాగా వచ్చిందని, అందరికీ నచ్చుతుందని సమంత చెప్పుకొచ్చింది.

సమంత శుభం మూవీ ప్రస్తుతం టేబుల్ ప్రాఫిట్స్‌లో ఉందని తెలుస్తోంది. ఇప్పటికే సమంతకు నాన్ థియేట్రికల్ ద్వారా చాలానే వచ్చిందని అంటున్నారు. శుభం మూవీకి కాస్త ఎక్కువ బడ్జెట్ అయిందని సమంత చెప్పినా కూడా.. అదేమీ ఎక్కువ కాదని అంటున్నారు. శుభం మూవీ మీద పెట్టిందంతా కూడా నాన్ థియేట్రికల్ నుంచే వచ్చిందని అంటున్నారు. ఇక థియేటర్లో వచ్చేదంతా కూడా లాభమే అని చెబుతున్నారు.

ఇలాంటి తరుణంలో సమంత తన మూవీని వీలైనంతగా ప్రమోట్ చేసుకుంటోంది. ప్రమోషనల్ సాంగ్ కోసం సమంత స్టెప్పులు వేసింది. ఇక ఇప్పుడు సమంత కోసం టాలీవుడ్ సెలెబ్రిటీలు స్టెప్పులు వేస్తున్నారు. చిన్మయి, రాహుల్, నందినీ రెడ్డి, శిల్పా రెడ్డి ఇలా అందరూ కూడా సమంతలా స్టెప్పులు వేస్తున్నారు. శుభం ప్రమోషనల్ సాంగ్‌కు తాజాగా కీర్తి సురేష్ కాలు కదిపింది. సమంత కోసం ఇది చేస్తున్నాను అని చెప్పుకొచ్చింది. మే 9న ఏడేళ్ల క్రితం మహానటి అంటూ ఓ అద్భుతం జరిగిందని కీర్తి సురేష్ చెప్పుకొచ్చింది. మళ్లీ మే 9న సమంత నిర్మాతగా శుభం చిత్రం వస్తోండటం ఆనందంగా ఉందని, ఆ మూవీ పెద్ద హిట్ అవ్వాలని కీర్తి సురేష్ పోస్ట్ వేసింది. ప్రస్తుతం కీర్తి సురేష్ వేసిన స్టెప్పులు వైరల్ అవుతున్నాయి.

# 'నేనూ సెయింట్ ఫ్రాన్సిస్‌లోనే చదివా..



అనుదీప్ జాతి రత్నాలు తరువాత మళ్లీ ఆ స్థాయిలో మెప్పించలేకపోయాడు. శివ కార్తికేయన్‌తో ప్రిన్స్ అనే మూవీని తీసి బోల్తా కొట్టాడు. కానీ అనుదీప్ రాసిన రైటింగ్, అతని కామెడీ టైమింగ్ మాత్రం క్లిక్ అయింది. శివ కార్తికేయన్ రేంజ్‌కి సరిపోని ఆ కథతో అనుదీప్ ప్రయోగం చేశాడని చెప్పాలి. ఈ సారి చాలా గ్యాప్ తీసుకున్న అనుదీప్ ఫంకీ అనే మూవీని స్టార్ట్ చేశాడు. అసలే ఫ్లాపుల్లో కొట్టుమిట్టాడుతున్న విశ్వక్ సేన్‌తో అనుదీప్ ఈ ఫంకీని ప్రారంభించాడు. విశ్వక్ సేన్ చివరగా లైలా అంటూ దారుణమైన ఫ్లాప్‌ని ఖాతాలే వేసుకున్నాడు. కెరీర్ స్టార్టింగ్‌లో ఉన్న కసి, ఆ ప్యాషన్ ఇప్పుడు కనిపించడం లేదని, కేవలం మాస్ మంత్రం జపిస్తూ, రెగ్యులర్ రొటీన్ కమర్షియల్ చిత్రాలు చేస్తూ మూసధోరణిలో ఉంటున్నాడని విమర్శిస్తున్నారంతా.

మరి ఇప్పుడు విశ్వక్ ఈ ఫంకీతో అయినా కం బ్యాక్ ఇస్తాడేమో చూడాలి.విశ్వక్ సేన్ ప్రస్తుతం సెట్‌లో అనుదీప్ చేస్తున్న హంగామాను రికార్డ్ చేసి సోషల్ మీడియాలో వదిలాడు. హీరోయిన్‌తో, ఇంకో ఆర్టిస్ట్‌తో అనుదీప్ ముచ్చట్లు పెడుతూ కనిపించాడు. సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్ అని అమ్మాయి చెబితే.. నేను కూడా అందులోనే చదివాను అని అనుదీప్ అంటాడు. అది అమ్మాయి కాలేజ్ కదా? నువ్వు ఎలా చదివావ్ అని అంటే.. ఓ ఇప్పుడు అలా మార్చారా? అని అనుదీప్ కవర్ చేస్తాడు. 1979 నుంచే మార్చారు అంటూ లేడీ ఆర్టిస్ట్ కౌంటర్ వేసింది. ఇక ఇంటర్ కోర్స్ చేసేందుకు జాయిన్ అయ్యానంటూ అనుదీప్ మళ్లీ ఏదో కవర్ చేసేందుకు ప్రయత్నించాడు. ఇదంతా కూడా విశ్వక్ సీక్రెట్‌గా రికార్డ్ చేస్తూనే ఉన్నాడు. చివరకు ఇదంతా రికార్డ్ చేస్తున్నాడని అనుదీప్ తెలుసుకోవడంతో ఆపేయ్ మామ అని అరిచేస్తాడు. అలా మొత్తానికి దర్శకుడు, హీరో, హీరోయిన్ సెట్‌లో ఫన్నీగా ఎంజాయ్ చేస్తున్నారని అర్థం అవుతోంది.